క్లుప్తంగా

రామాలయానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న మావుడి సోదరులు

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామంలో రామాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు పూజలు చేశారు.

బర్లి బీసీ కాలనీలో బోరు



బోరు తవ్వేందుకు టెంకాయ కొట్టిన ఎంపీటీసీ శారద

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామం బీసీ కాలనీలో ఎమ్మెల్యే జోగారావు ఆదేశానుసారం బోరు నిర్మాణం చేసినట్లు ఎంపీటీసీ శారద తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే జోగారావు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. గతంలో బీసీ కాలనీలో నీటి సమస్య ఉండేదని ప్రస్తుతం బోరు ఏర్పాటుతో నీటి సమస్య తీరే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజలు

సాలూరు: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు హైందవ ధర్మసేన, వెలమ పేటయూత్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలో శివాజీ జంక్షన్ వద్ద గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శివాజీ గొప్పతనాన్ని వక్తలు వివరించారు. జై ఛత్రపతి నినాదాలతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది.

బాగువలసలో ఘనంగా రామాలయ వార్షికోత్సవం



బాగువలస రామాలయంలో చేస్తున్న పూజలు

సాలూరు: మండలంలోని బాగువలస గ్రామంలో రామాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ధర్నా

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న 2,361 మంది కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలని కోరుతూ పలువురు ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణారావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అమ్మునాయుడు మాట్లాడుతూ, నెలకు పది వేల రూపాయల గౌరవవేతనంతో పాటు టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. అలాగే యూనిఫాం, మెడికల్ కిట్లు అందజేయాలన్నారు. పది లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఓ రోసిరెడ్డి, డిప్యూటీ డీఎం హెచ్ఓ విజయపార్వతిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, కాంతారావు, ఎం.లక్ష్మణరావు, రమణమ్మ, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

అందంగా మారిన ఆర్.వెంకంపేట

- ప్రజాసౌలభ్యం కోసమే గ్రామంలో అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఆర్ వెంకంపేట సచివాలయం



రైతుభరోసా భవనం

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీమేరకు గ్రామాల్లో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతపక్షనేతగా ఉన్నప్పుడు జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర సమయంలో ప్రజలకష్టాలను తెలుసుకుని పరిష్కరించారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంలోని ఆర్.వెంకంపేట సచివాలయం పరిధిలో విద్య, వైద్య, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో గ్రామంలో ఏర్పాటైన సచివాలయ అధికార సిబ్బందికి రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రైతుల కోసం రూ.22 లక్షలతో ఆర్బీకే భవనం, రూ.18.5 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం, రూ 2.10 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణం చేశారు. ఉన్నత పాఠశాలకు రూ.60 లక్షలతో అదనపుభవనాల నిర్మాణం జరుగుతోంది. ప్రాథమిక పాఠశాల భవనాలకు రూ.28.70 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. మంచినీటి సౌకర్యం కల్పనకు జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.57.2 లక్షలు మంజూరయ్యాయి. అలాగే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో విడుదలయ్యాయి.

ఇది కదా, అభివృద్ధి

పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారం

గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని 1100 మీటర్ల సీసీ కాలువ, సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల నిధులు విడుదల చేయించడంతో పనులు పూర్తయ్యాయి.



సీసీ కాలువలు

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం



మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆదుకుంటున్న జగనన్నకు అండగా ఉంటాం. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం, పిల్లల చదువులకోసం అమ్మ ఒడి పథకం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. గ్రామంలో నిలువ నీడలేని పేదలను గుర్తించి అర్హతను బట్టి ఆదుకుంటున్న జగనన్నకు అండగా ఉంటాం.

– కర్రి రామలక్ష్మి, పొదుపు సంఘం సభ్యురాలు

జగనన్న ప్రభుత్వం రాకతోనే అభివృద్ధి



జగనన్న ప్రభుత్వం రావడంతో దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని మా గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి బీటీ రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం కల్పించారు. దీంతో మేము నిరంతరం ఎదుర్కొంటున్న రహదారి సమస్య తీరింది. ఆర్బీకే ద్వారా ధాన్యం విక్రయించిన 36 గంటల్లోనే బిల్లులు బ్యాంక్ ఖాతాల్లో జమయ్యాయి. కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరాన్ని తగ్గించి వలంటీర్లతో పనులు చేయించుకుంటున్నాం. మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం.

– పి.బలరామస్వామి, రైతు, ఆర్‌వెంకంపేట

విద్యాభివృద్ధికి తోడ్పాటు



గ్రామంలో విద్యాభివృద్ధికి తోడ్పాటునిస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యశిస్తున్నారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా అభివృద్ధికి తోడ్పడుతున్న జగనన్న ప్రభుత్వానికి మేమంతా అండగా ఉంటాం.

– పెంట శ్రీనివాసరావు, రైతు



గ్రామీణ ఆరోగ్య కేంద్రభవనం



బీటీ రోడ్డు

మాజీ జెడ్పీటీసీ కుటుంబ సభ్యులకు పరామర్శ



శంకరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామంలో మాజీ జెడ్పీటీసీ కె.శంకరరావు ఇటీవల స్వర్గస్తులైనందున ఆయన కుటుంబసభ్యులు నిర్వహించిన పెదకర్మ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సోమవారం పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరామర్శలో సర్పంచ్, ఎంపీటీసీ, మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, పోపురెడ్డి అప్పలనాయుడు, జక్కువ పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పారావు, బాయఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఉపాధిహామీ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వేతనదారులు ఉపాధిపనుల్లో అధిక సంఖ్యలో పాల్గొనేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో వేతనదారులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులను కల్పించాలని ఆదేశించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని బలిజిపేట మండలంలోని వంతరాం స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ చైర్మన్ మురళి తెలిపారు. ఈ మేరకు వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సమయంలో ఏ విధంగా వారికి బోధించాలో శిక్షణద్వారా తెలుసుకుని బోధించడం ఎంతో మంచిదన్నారు. మంచి, మంచి అంశాలను చర్చించి ఉపాధ్యాయులకు ఉండే అనుమానాలను నివృత్తి చేసుకుని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు అనుగుణంగా ఉండే విధంగా బోధించి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అందులో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు రమేష్ సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: ప్రాథమిక, హైస్కూల్ స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని పార్వతీపురం ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండల పరిధిలోని చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం పట్టణ పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ సంస్కృత ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఎంఈఓ సామల సింహాచలం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఎప్పటికప్పుడు తీసుకువస్తున్న నూతన విద్యావిధానాలకు అనుగుణంగా తరగతి గదిలో బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి నెలా కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాల్లో అవగాహన చేసుకుంటున్న నూతన బోధన విషయాలను విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు డి.విజయ్‌కుమార్, గౌరి, హేమసుందర్, వరప్రసాద్, సీఆర్‌ఎంటీలు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సచివాలయ భవనాల ప్రారంభం



సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధిలో రూ.87.02 లక్షల నిధులతో నిర్మించిన 1-2 గ్రామ సచివాలయ భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ప్రారంభించారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు సర్పంచ్ తేరే జమ్మ, ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, అభిమానులు, వలంటీర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యస్థాపన సచివాలయవ్యవస్థ తోనే సాధ్యమని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వం రాకతోనే గ్రామంలో ఇంటింటి కుళాయిలు, పక్కాగృహాల మంజూరుతో సొంతింటి కల నెరవేర్చడం, మహిళలను వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా ఆదుకోవడం, సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధిచేకూర్చినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరో పర్యాయం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం మనందరిపైనా ఉందని పిలుపునిచ్చారు.

వలంటీర్లకు సత్కారం

మండలకేంద్రంలోని వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తుచేస్తూ వారందరినీ ప్రశంసా పత్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. జగనన్న ప్రభుత్వానికి గ్రామవలంటీర్ వ్యవస్థ మానస పుత్రికఅని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఈ సందర్భంగా అభివర్ణించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఎంపీడీఓ ఏఓ ప్రసాద్, ఏఓ ఎస్.అవినాష్, సచివాలయ కన్వీనర్లు బి.సూర్యనారాయణ, సురగాల కిరణ్, పీఏసీఎస్‌చైర్మన్ కూర్మారావు, యు.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెదభోగిలి వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

మార్కెట్ అభివృద్ధే ధ్యేయం

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘంలోని నెహ్రూ మార్కెట్ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని మార్కెట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులకు అభివృద్ధిపై పూర్తి హామీఇచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలను రూపొందించి త్వరితగతిన పనులను ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంగు చిట్టిరాజు, కౌన్సిలర్ రణభేరి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అటవీ మంటల నివారణకు సహకరించాలి

గుమ్మలక్ష్మీపురం: వేసవిలో అటవీ మంటలు నివారించేందుకు పోడుభూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు సహకరించాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జి.సీలామణి కోరారు. మండలంలోని కర్లగూడ, రాయగడజమ్ము, కుడ్డ గ్రామాల్లోని గిరిజనులకు అటవీ మంటల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. పోడుభూమి సాగుపేరుతో అటవీ ప్రాంతంలో మంటలు వేయడం వల్ల పక్కనే ఉన్న తుప్పలకు మంటలు అంటుకుని మొత్తం అటవీ ప్రాంతానికి విస్తరించే అవకాశం ఉందన్నారు. పిచ్చిమొక్కలు, ఎండిన ఆకులను, కొమ్మలను ఎక్కడ పడితే అక్కడ మంటపెట్టకుండా ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి మంటపెట్టాలని, అవి పూర్తిగా కాలిన తరువాత మంటలను ఆర్పివేయాలని సూచించారు.

జగనన్నే మళ్లీ సీఎం

- ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధం
- ఎమ్మెల్యే అజలంగిజోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జగనన్నను మళ్లీ సీఎంను చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అలజంగిజోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జగనన్నను గెలిపించండి అంటూ మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామ ప్రజలకు పిలుపిస్తూ సార్వత్రిక ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం లేదు, మతం లేదు, పార్టీ లేదు, ఆఖరికి మమ్మల్ని ద్వేషించినా సరే పేదవారైతే చాలు ప్రజలందరికీ మేలు చేసే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక లక్ష్మీ నారాయణపురం గ్రామంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా సర్పంచ్ జక్కు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చేసి చూపించామన్నారు. మన గ్రామం, మన ప్రాంతం, మన రాష్ట్రం ఇంకా అభివృద్ధి సాధించాలన్నా, పేద, బడుగు,బలహీన వర్గాలకు మరింత మేలు జరగాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తప్పక గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించాలన్నా, మళ్లీ మన పేదల ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నా ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయాన్ని అందించేందుకు సర్వసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా ఈ గ్రామం నుంచే ఎన్నికల శంఖారావం పూరించామని మీ అందరి ఆశీర్వాదం ఎల్లప్పుడూ మాపై ఉంచి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డా. ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బంకురు రవి కుమార్, సర్పంచ్ జక్కు ప్రవీణ్ కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంపలి గురురాజు, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, ఎంపీటీసీ బడే రామారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొత్తాడ నాగభూషణరావు, సోమశేఖర్, గ్రామపెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో పార్వతీపురం మండలం, లక్ష్మీనారాయణపురం గ్రామం నుంచి భారీ ఎత్తున టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకుని ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరికీ కూడా ఎమ్మెల్యే సాదర స్వాగతం పలుకుతూ మనమందరం ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో బొంగు శంకరరావు, కొరిపిల్లి శంకరరావు, మూడడ్ల సీతం నాయుడు, మరిపి రాము, డోకుల తవిటి నాయుడు, చింతల సివున్నాయుడు, అల్లు త్రినాథలతో పాటు వారి కుటుంబసభ్యులు ఉన్నారు.



పార్వతీపురం టౌన్: సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకుందాం

ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్టీని మరింత అభివృద్ధి చేసుకునేందుకు సోమవారం పట్టణంలోని 18వ పోలింగ్ బూత్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రెండవసారి ప్రజల ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ప్రతి ఒక్క కార్యకర్త కీలక భూమిక పోషించి నియోజకవర్గంలో గతం కంటే అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, ముగడ జగన్‌మోహనరావు, వి.వాసు, కార్యకర్తలు, గృహ సారథులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకే ఫ్యామిలీ డాక్టర్



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఓ డాక్టర్ తెర్లి జగన్‌మోహన్ రావు

సీతానగరం: గ్రామీణ ప్రజల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని వినియోగించుకోవాలని జిల్లా మలేరియా నివారణఅధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు కోరారు. ఈ మేరకు సోమవారం సీతానగరం మండలంలోని బూర్జలో 108 ద్వారా పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ ప్రభుతేజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరానికి వచ్చిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను, గర్భిణుల ఆరోగ్యం, బాలింతలు తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. కొత్తగా వివిధ రకాల వ్యాధులతో వస్తున్న వారికి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మందులు పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, వ్యాధి లక్షణాలను పరిశీలించి సేవలు అందించాలన్నారు. మంచం పైనుంచి కదలలేని రోగులను గుర్తించడానికి గృహసందర్శన చేసి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది నరసమ్మ, వెంకటేశ్, 104 సిబ్బంది నవీన్, రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు సరిచూసుకోవాలి

కురుపాం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలను సరిచూసుకోవాలని, తప్పులు, సవరణలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.